క్లుప్తంగా

ఎస్పీకి ఆహ్వానం..

కొత్తగూడెంటౌన్‌: ఈ నెల 17న లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామంలో జరగనున్న సంత్‌శ్రీ సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి, భోగ్‌ బండారో కార్యక్రమానికి రావాలని కోరుతూ బుధవారం సేవాలాల్‌ సేనా నాయకులు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజుకు ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో జుంకీలాల్‌ నాయక్‌, లాలు నాయక్‌, లావుడ్యా ప్రసాద్‌నాయక్‌, దేవీలాల్‌ నాయక్‌, సునావత్‌ రాంబాబు నాయక్‌, ధరావత్‌ నాగరాజునాయక్‌, బానోతు దుర్గాప్రసాద్‌ నాయక్‌, సేవ్యా నాయక్‌ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంటౌన్‌: ప్రేమికుల పేరిట మీకు గిఫ్ట్‌ కూపన్లు వచ్చాయి... స్పెషల్‌ ఆపర్ల కింద టూర్లకు సెలక్ట్‌ అయ్యారని వచ్చే మేసేజ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం వన్‌టౌన్‌ సీఐ ఎం.కరుణాకర్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవం కావడంతో యువత సెలబ్రేట్‌ చేసుకునేందుకు, గిఫ్ట్‌ల కోసం ఆన్‌లైన్‌ షాపింగ్‌ చేసేవాళ్లు సైబర్‌ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రౌండ్‌ చెక్‌ పాయింట్ల ఏర్పాటు

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలో మాస్టర్‌ ప్లాన్‌ కోసం బుధవారం గ్రౌండ్‌ చెక్‌ పాయింట్లను ఏర్పాటు చేశారు. సర్వే ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే డ్రోన్‌ సర్వేలో భాగంగా ఏర్పాటు చేస్తున్న గ్రౌండ్‌ చెక్‌ పాయింట్ల పనులను మున్సిపల్‌ కమిషనర్‌ శేషాంజన్‌ స్వామి పరిశీలించారు.

మండలంలో 23,438 మంది ఓటర్లు

సుజాతనగర్‌: మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల సంఖ్య తేలింది. మండలంలో 8 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. మండలంలో మొత్తం 44 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 23,498 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 11,494, మహిళలు 11,943, ఇతరులు ఒక్కరు ఉన్నారు. ఈ జాబితాపై నేటి వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు.

జేబీపీ జిల్లా అధ్యక్షుడిగా ‘గంధం’

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): జైభీమ్‌రావు భారత్‌ పార్టీ జాతీయ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్‌ ఆదేశాల మేరకు కొత్తగూడెం గాజులరాజం బస్తీకి చెందిన గంధం మల్లికార్జునరావును ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యర్రా కామేష్‌ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ బుధవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామేష్‌ మాట్లాడుతూ.. ఎవరైతే దెబ్బలు తింటారో వాళ్లే కేకలు వేయాలని చెప్పిన మహాత్మా జ్యోతిరావు పూలే వ్యాఖ్యలను బహుజనులు ఆదర్శంగా తీసుకుని సమానత్వం కోసం, హక్కుల సాధన కోసం ధైర్యంగా పోరాడాలన్నారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా పర్యటించి త్వరలో జిల్లా కమిటీ నిర్మాణం చేసి పోలింగ్‌ బూత్‌స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

‘జేవీవీ’ ఆధ్వర్యంలో సెమినార్‌

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): డార్విన్‌ జీవ పరిణామ క్రమ సిద్ధాంతంపై జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రచారోద్యమంలో భాగంగా బుధవారం రామవరం ఎస్‌ఆర్‌ డీజీ భారత్‌ స్కూల్‌లో సెమినార్‌ నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర నాయకురాలు ఎ.కస్తూరి పాటతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌.సాయిబాబా ప్రధాన వక్తగా పాల్గొన్నారు. శ్రీరామచంద్ర కళాశాల మాజీ ప్రిన్సిపాల్‌ సతీష్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ వేణుగోపాల్‌, సీహెచ్‌ తిరుపాల్‌ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా డార్విన్‌ జీవ పరిణామ క్రమ సిద్ధాంత ప్రచారోద్యమ పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపాల్‌ ప్రదర్శించిన ఇంద్రజాలం విద్యార్థులను అలరించింది.

ద్రవిడియన్‌ ఫిలిం చాంబర్‌ రాష్ట్ర కార్యదర్శిగా రమేష్‌


పాల్వంచరూరల్‌: మండల పరిధి దంతలబోరు ఎస్సీ కాలనీ మాజీ సర్పంచ్‌ గద్దల రమేష్‌ను ద్రవిడియన్‌ ఫిలిం చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ మామిడి సుదర్శన్‌ను బుధవారం నియమించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నియమామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌ మాట్లాడుతూ... నిరంతరం సినీ కార్మికుల పక్షాన ఉంటూ వారి సమస్యల సాధనకు కృషి చేస్తామన్నారు.

సత్తాచాటిన గురుకుల విద్యార్థి

పాల్వంచరూరల్‌: లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలకు చెందిన చరణ్‌తేజ్‌ జేఈఈ మెయిన్స్‌ లో 94.8 పర్సంటైల్‌తో సత్తా చాటాడు. ఈ మేరకు బుధవారం చరణ్‌తేజ్‌ను కళాశాల ప్రధానాచార్యులు అనిల్‌, అధ్యాపకులు అభినందించారు.

టమాట రైతు డీలా..

- మార్కెట్‌లో పడిపోతున్న ధర
- ఆందోళనలో రైతన్నలు
- గిట్టుబాటు ధర అమలుకు చర్యలు తీసుకోవాలని వినతి





లైన్‌తండాలో సాగు చేసిన పందిరి టమాట

జూలూరుపాడు: మార్కెట్‌లో టమాట ధర రోజురోజుకు పడిపోతోంది. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల క్రితం కిలో ధర రూ.100 పైగా పలకడంతో రైతులకు కాసులు కురిపించిన టమాట ప్రస్తుతం నష్టాలు తెస్తోంది. ఈ సీజన్‌లో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో టమాట పంట సాగు చేయడంతో దిగుబడి కూడా గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం కిలో టమాట ధర రూ.2 నుంచి రూ.3 పలుకుతుండటంతో రైతులకు దిక్కుతోచడం లేదు. కూలీల, రవాణా ఖర్చు కూడా రావడం లేదని తోటల్లోని టమాట కాయలు కోయకుండా వదిలేస్తున్నారు. అదేవిధంగా మార్కెట్‌లో కొనేవారు లేకపోవడంతో పశువులకు మేతగా పెడుతున్నారు. గిట్టుబాటు ధర దక్కట్లేదన్న బాధతో రైతులు టమాటను మార్కెట్‌కు తీసుకెళ్లడం మానేశారు. మార్కెట్‌లో టమాట ధర స్థిరంగా ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. టమాటను మార్కెట్‌కు తీసుకెళ్లినా, కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో 28 నుంచి 30 కిలోలు బరువు ఉండే బాక్స్‌ (పెట్టె) ధర రూ.60 నుంచి రూ.70 మాత్రమే వ్యాపారులు చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గతేడాది జూన్‌, జూలైలో కిలో టమాట ధర రూ.100 పైగా పలికింది. ఈ ఏడాది వర్షాకాలం పంట చేతికి రావడంతో క్రమేపి మార్కెట్‌లో టమాట ధర పతనం అవుతూ జనవరి నుంచి మరింతగా ధర పడిపోయిందంటున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు రైతుల వద్ద బాక్స్‌ ధర రూ.60–70లకు కొనుగోలు చేసిన వ్యాపారులు తిరిగి హోల్‌సెల్‌ కస్టమర్లకు రూ.150 – రూ.200లకు అమ్ముతున్నారు. చిల్లర వ్యాపారులు మాత్రం ప్రజలకు కిలో రూ.10 – రూ.15లకు అమ్ముతున్నారు. ఒక ఎకరం టమాట పంట సాగుకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుంది. అదే పందిరిపై సాగు చేస్తే రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ధర పడిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో టమాట పంట సాగు చేస్తున్నారు. రైతులు వీటిని కొత్తగూడెం, అశ్వాపురం, అశ్వారావుపేట, ఏపీ రాష్ట్రంలోని విజయవాడ, జంగారెడ్డిగూడెం, ఏలూరు, రాజమండ్రి, ఒంగోలు, నెల్లూరు, కడప, ఛత్తీస్‌గఢ్‌, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు టమాటను కొనుగోలు చేసి తరలిస్తుంటారు. ప్రస్తుతం వ్యాపారులు రావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టమాటకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



తోటలో టమాటాలు చూపిస్తున్న రైతు

పెట్టుబడి కూడా రావడం లేదు..



ఖర్చులు కూడా రావడంలేదు. ఇరవై ఏళ్లుగా టమాట సాగు చేస్తున్నాం. ఈ ఏడాది దిగుబడి బాగానే ఉన్నప్పటికీ ధర లేదు. మార్కెట్‌లో 30 కిలోల పెట్టె రూ.60లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.30 వేలు మాత్రమే వచ్చాయి. తోట వద్దకు వచ్చే వ్యాపారులు పెట్టె రూ.40 – రూ.50లకు కొంటున్నారు. దీంతో తోటలో టమాటాలు కోయకుండా వదిలేశాం.

– ధరావత్‌ నరసింహారావు, రైతు, కరివారిగూడెం

పందిరి టమాటకు పెట్టుబడి ఎక్కువ..



ఒక ఎకరం టమాట సాగుకు రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టాం. పందిరి టమాట సాగుకు పెట్టుబడి పెరిగింది. దిగుబడి బాగానే ఉన్నా ధర లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. తోటలో టమాటలు ఏరినప్పుడుల్లా ఒక్కో కూలీకి రూ.400 ఇస్తున్నాం. ఖర్చులు కూడా రాకపోవడంతో టమాటలు పశువులకు మేతగా పెడుతున్నాం. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– భూక్యా నాగేశ్వరరావు, రైతు, లైన్‌తండా

‘చలో హైదరాబాద్‌’ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామిక హక్కుల కోసం, ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్‌ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమోక్రసీ నాయకులు ఆవునూరి మధు కోరారు. బుధవారం కొత్తగూడెంలోని రైటర్‌ బస్తీలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటా సౌభాగ్యం ఇందిరమ్మ ఇల్లు అంటూ ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వలేదని, రేషన్‌ కార్డుల పంపిణీ చేయలేదన్నారు. హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం నేడు బూటకపు ఎన్‌కౌంటర్‌ పేరుతో ప్రశ్నించే వారిని ఉపా కేసులతో అక్రమ అరెస్టులతో నిర్బంధిస్తోందని విమర్శించారు. పోడు భూములకు పట్టాలివ్వడం లేదని, కౌలు రైతులకు రూ.15000 ఇస్తామని ఇప్పటి వరకు ఆ ఊసే లేదని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ రాక కాలేజీల్లో విద్యార్థులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జే.సీతారామయ్య, ఎస్కే ఉమర్‌, ఎస్‌.సంజీవ్‌, మల్లికార్జున్‌రావు, జే.మంజుల, అలీమొద్దీన్‌, మారుతీరావు, సురేష్‌, రమేష్‌, సంధ్య, రాములు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా బంద్‌

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): విద్యుత్‌ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తామని కొత్తగూడెం విద్యుత్‌ ఏడీఈ హేమచంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బర్మా, బాబు క్యాంపు, బర్లీ ఫీట్‌, సన్యాసి, మధుర బస్తీ, బస్టాండ్‌, రామా టాకీస్‌ ఏరియాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీధి కుక్కల పట్టివేత

ఇల్లెందు: కార్మికవాడలో అటు వీధి కుక్కలు ఇటు కోతుల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారు. ఏడాది నుంచి వీధి కుక్కలు, కోతులను పట్టుకుని వాటి పునరుత్పత్తిని నివారించేందుకు కొత్తగూడెంలోని డాగ్‌ కేర్‌ సెంటర్‌కు తరలించి స్టెరిలైజేషన్‌, వ్యాక్సినేషన్‌ ప్రక్రియ పూర్తి చేసి మరలా వాటిని యథాస్థానాల్లో వదిలిపెడుతున్నారు. బుధవారం పట్టణంలోని స్టేషన్‌ బస్తీ, గోవింద్‌ సెంటర్‌లో వీధి కుక్కలను బోనులో బంధించి కొత్తగూడెం డాగ్‌ కేర్‌ సెంటర్‌కు తరలించారు. మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీకాంత్‌ హాజరై ఈ ప్రక్రియను పరిశీలించారు.

ఫ్లెక్సీ తొలగింపు

టేకులపల్లి: రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ అమలులో ఉంది. ఎన్నికల కోడ్‌ పక్కాగా అమలు చేయాలనీ కలెక్టర్‌ పాటిల్‌ అధికారులకు ఆదేశాలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో అన్ని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్‌ రైటింగ్‌లను తొలగించారు. కానీ సాక్షాత్తు టేకులపల్లి మండల విద్యాశాఖ కార్యాలయం గోడలపై ఉపాధ్యాయ సంఘం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మాత్రం అధికారులు తొలగించలేదు. దీనిపై బుధవారం సాక్షిలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు బుధవారం మున్సిపల్‌ సిబ్బందిచే ఉపాధ్యాయ సంఘం ఫ్లెక్సీని తొలగించారు.

వేతనాల పెంపుపై స్పందించండి..



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాల పెంపుపై యాజమాన్యం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని, ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. బుధవారం కొత్తగూడెం కార్పొరేట్‌ ఏరియా పరిధిలోని కాంట్రాక్ట్‌ కార్మికుల అడ్డాలలో నిర్వహించిన జనరల్‌ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మారి 14 నెలలు గడిచినా కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాలు పెంచకపోవటం శోచనీయమన్నారు. తక్షణమే ఇచ్చిన హామీల ప్రకారం పెంచాలని, కనీస వేతనాల సలహా మండలిలో కూడా కనీస వేతనాల జీఓలను రివైజ్‌ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం తక్షణమే కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాల పెంపుదలపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టీఈఈ సంఘం జూబ్లీ వేడుకలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

పాల్వంచ: తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్‌ (1104) యూనియన్‌ 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జూబ్లీ వేడుకలను నిర్వహించారు. బుధవారం కేటీపీఎస్‌ పాండురంగాపురం సెంటర్‌ నుంచి ఉద్యోగులు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం కార్యాలయంలో యూనియన్‌ జెండాను రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సంగం సుధీర్‌ ఆవిష్కరించారు.

అనంతరం కేక్‌ కట్‌ చేశారు. పలువురు సీనియర్‌ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో జెన్‌కో అధ్యక్షుడు కేశబోయిన కోటేశ్వరరావు, సీతారామిరెడ్డి, నాయకులు, ఆర్టిజన్‌ కార్మికులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

టేకులపల్లి: శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అందరూ శాకాహారంలోకి రావాలని శాకాహారులు, ధ్యాన మాస్టర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పిరమిడ్‌ స్పిరిచ్యువల్‌ సొసైటీ మూవ్‌మెంట్‌ ఇండియా, శ్రీవెంకటేశ్వర పిరమిడ్‌ ధ్యాన మందిరం, మాస్టర్ల ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు శాకాహారం, ధ్యానం ప్రాముఖ్యతను తెలియజేశారు. రావులపాడులోని శ్రీవెంకటేశ్వర పిరమిడ్‌ ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. మాట్లాడుతూ... ధ్యానం వలన మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం, నాడీ మండల శుద్ధి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుదల, అనేక రోగాల నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పట్టణాల పిరమిడ్‌ మాస్టర్లు వడ్డెరాధ, అప్పారావు, నెల్లూరి సత్యం, కస్తూరి, జాలాది కోటేశ్వరరావు కవిత, రమేష్‌, వెంకటేశ్వర్లు, ఆశ, రాఘవ, శరత్‌, మురళి, హనుమంతరావు, నాగేశ్వర్‌రావు, శైలజ పాల్గొన్నారు.

లైఫ్‌ సైకిల్‌ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ



మాట్లాడుతున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఆఫీసర్స్‌ క్లబ్‌లో బుధవారం జరిగిన శాప్‌ ఫైల్‌ లైఫ్‌ సైకిల్‌ మేనేజ్‌మెంట్‌పై ఈఆర్‌పీ డిపార్ట్‌మెంట్‌ కార్పొరేట్‌ వారు ఇల్లెందులో పని చేస్తున్న అధికారులకు ఉద్యోగులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఏరియా జీఎం కృష్ణయ్య హాజరై మ్యాన్యువల్‌ ఫైల్‌ డిస్పాచ్‌ నుంచి ఆన్‌లైన్‌ ఫైల్‌ డిస్పాచ్‌కు మధ్యలో సమయం, శ్రమను ఈ విధానం ద్వారా ఆదా చేయవచ్చన్నారు. ఈఆర్‌పీ డిపార్ట్‌మెంట్‌ కార్పొరేట్‌ నుంచి హరిప్రసాద్‌ హాజరై వివిధ రకాల నోట్‌ ఫైల్‌ డాక్‌ ఫైల్స్‌ ఎఫ్‌ఎల్‌ ఫైల్స్‌ వెబ్‌ అప్లికేషన్స్‌లో ప్రాసెస్‌ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, డీజీఎం పర్సనల్‌ జీవీ మోహన్‌రావు, రవికుమార్‌, మధుబాబు, సుధాకర్‌, దిలీప్‌కుమార్‌, రమ్య తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా కారుణ్య నియమాల కోసం జీఎం కార్యాలయంలో ముఖాముఖి నిర్వహించారు.

ఎమ్మెల్సీగా సరోత్తమరెడ్డి గెలుపునకు కృషి



మాట్లాడుతున్న ఎడ్ల అశోక్‌రెడ్డి

ఇల్లెందు: ఖమ్మం – నల్లగొండ – వరంగల్‌ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమరెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌ ఎడ్ల అశోక్‌రెడ్డి సూచించారు. ఇల్లెందులో బుధవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తితో సరోత్తమరెడ్డి ఎంతో సేవ చేయగా, రెండు దఫాలు పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని తెలిపారు. ఈ మేరకు ఆయను ఎమ్మెల్సీగా గెలిపించడంలో పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు జీవీకే.మనోహర్‌, బోడా పూన్యానాయక్‌, మిర్యాల వెంకటేశ్వర్లు, మావునూరి మాధవ్‌, గుగులోతు రాంచందర్‌నాయక్‌, బి.శ్రీనునాయక్‌, చిక్కాల వెంకటేశ్వర్లు, దోమల మహేశ్వర్‌, తేజావత్‌ శంబు, జర్పుల రాంచంద్రు, నాయిని శ్రీనివాసరెడ్డి, రేవళ్ల నాగరాజు, శివకుమార్‌ ఖండేల్‌వాల్‌ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ బిల్లులు విడుదల చేయండి..



మాట్లాడుతున్న పవన్‌కుమార్‌

జూలూరుపాడు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు పెరుమాళ్ల పవన్‌కుమార్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల చదువు పూర్తయినప్పటికీ స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ అందకపోవడంతో యాజమాన్యాలు ఫీజు కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

క్రికెట్‌ టోర్నీ విజేత టేకులపల్లి టైగర్స్‌



బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

టేకులపల్లి: మండలంలోని బేతంపూడి స్టేజీలో నిర్వహించిన శ్రీరామ్‌ మెమోరియల్‌ వెంకట్యాతండా ప్రీమియర్‌ లీగ్‌ సీజన్‌–1 క్రికెట్‌ టోర్నీలో టేకులపల్లి టైగర్స్‌ జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. ఈనెల 5న ప్రారంభమైన టోర్నీలో 30 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో టేకులపల్లి టైగర్స్‌ – మంగ్యా తండా న్యూస్టార్‌ 11 జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టేకులపల్లి జట్టు 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. అనంతరం వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన టేకులపల్లి టైగర్స్‌, మంగ్యాతండా, వెంకట్యాతండా జట్లకు నగదు, ట్రోఫీలు అందజేశారు. నిర్వాహకులు ఇంతియాజ్‌, భూక్యా రాజ్‌కుమార్‌, ఆంగోతు చందులాల్‌, ఈది గణేష్‌, ఆంగోతు లక్‌పతి, నాగుల స్వామి, సోముల భానుచందర్‌, రాయల ప్రశాంత్‌, వీరభద్రం, లచ్చిరాం, వెంకటేశ్వర్లు, డి.హుస్సేన్‌, భద్రు పాల్గొన్నారు.

వైవిధ్యాలే కొత్త జాతులకు మూలాధారం



గూగుల్‌మీట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఇల్లెందురూరల్‌: వైవిధ్యాలే కొత్త జాతులకు మూలాధారాలని వృక్షశాస్త్ర సహాయక ఆచార్యులు డాక్టర్‌ చరకన చైతన్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డార్విన్‌ డే నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా గణపవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర సహాయక ఆచార్యులు డాక్టర్‌ చరకన చైతన్య గూగుల్‌ మీట్‌ ద్వారా ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ముచ్చటించారు. డార్విన్‌ ప్రతిపాదించిన జీవపరిణామ సిద్ధాంతం ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏకకాలంలో రూపొందినట్లు ఎంతోకాలం నమ్ముతూ వచ్చిన ప్రజలకు అదంతా వాస్తవం కాదని, ఒక మాతృక నుంచి సకల జీవరాశులు క్రమానుగుణంగా పరిణామం చెందుతూ ఏర్పడ్డాయని, ఈ చర్య అనంతంగా కొనసాగుతోందని మొట్టమొదట వివరించింది డార్విన్‌ అని చెప్పారు. ఆధునిక కాలంలో డార్వినిజం చాలా మార్పు తెచ్చిందని మూఢ నమ్మకాలను విభేదించడలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించిందన్నారు.

టీయూసీఐ మహాసభను జయప్రదం చేయండి



ప్రచారం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): టీయూసీఐ మహాసభను జయప్రదం చేయాలని, ఆ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ యాకూబ్‌షావలీ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలోని కార్మికుల అడ్డాలలో మహాసభను జయప్రదం చేయాలని విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటికే సింగరేణి, మున్సిపల్‌, గ్రామపంచాయితీ, కేజీబీవీ తదితర రంగాల్లో కార్మికుల అనుబంధం సభలు జరుపుకుంటున్నారని, ఈనెల 16న కొత్తగూడెంలోని ఉర్దూ ఘర్‌ ఫంక్షన్‌ హాల్‌లో జరగనున్న జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.సతీష్‌, సంధ్య, కృష్ణ, కరుణ, శాంత, మంగ, భగవాన్‌, రామకృష్ణ, భాగ్యలక్ష్మి, నిర్మల, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

మినీ మేడారం జాతర ప్రారంభం

- కిటకిటలాడుతున్న గద్దెల ప్రాంతం
- సమ్మక్క, సారలమ్మలకు ఘనంగా పూజలు



ఇల్లెందురూరల్‌: గద్దెల వద్ద రద్దీ



కొత్తగూడెంటౌన్‌: వడిబియ్యం కలుపుతున్న భక్తులు

ఇల్లెందురూరల్‌: మండలంలోని బొజ్జాయిగూడెం సమీప అటవీ ప్రాంతంలో వన దేవతల గద్దెల వద్ద సమ్మక్క – సారలమ్మ చిన్న జాతర వైభవంగా ప్రారంభమైంది. ఆలయ పూజారులు వన దేవతల ఆభరణాలను సమీపంలోని జంపన్న వాగులో శుద్ధి చేశారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేసి నూతన వస్త్రాలతో వనదేవతలను అలంకరించారు. బోనం, బంగారంలను నైవేద్యంగా సమర్పించారు. దీంతో చిన్న జాతర ప్రారంభమైంది. మూడు రోజులు కొనసాగే జాతరలో తొలిరోజు బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు గద్దెలకు సమీపంలో గుడారాలు ఏర్పాటు చేసుకొని సహపంక్తి బోజనాలు చేస్తున్నారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతుండటంతో కమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తుండగా జాతర ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టారు.

కొత్తగూడెంటౌన్‌: సమ్మక్క – సారలమ్మ మినీ మేడారం జాతర రామవరం టూ ఇంక్లైన్‌ ప్రాంతంలోని సమ్మక్క – సారలమ్మ గద్దెల వద్ద బుధవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఈ జాతర జరగనుందని ఆలయ ధర్మకర్త తమ్మిశెట్టి అశోక్‌ తెలిపారు. కొత్తగూడెం, రామవరం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి తల్లులకు పూజలు నిర్వహించారు.